## క్లుప్తంగా

### శుద్ధ జలంతో ఆరోగ్యం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వికాస్‌రావు దంపతులు

**చందుర్తి:** సంపూర్ణ ఆరోగ్యానికి శుద్ధ జలం ఎంతగానో దోహదపడుతుందని ప్రతిమ ఫౌండేషన్ అధినేత చెన్నమనేని వికాస్‌రావు, దీప దంపతులు అన్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని మల్యాల జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్‌ను వికాస్‌రావు, దీప దంపతులు బుధవారం ప్రారంభించి మాట్లాడారు. కలుషితమైన నీరు సేవించడం వల్ల మనుషులకు 90 శాతం జబ్బులు వస్తున్నాయని, సంపూర్ణ ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేసేందుకు గ్రామాల్లో ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ గట్టు లక్ష్మీనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి, ఎస్ఎంసీ చైర్మన్ పులి రాజేందర్, సెస్ మాజీ చైర్మన్ అల్లాడి రమేశ్, వివేకానంద సేవా సమితి అధ్యక్షుడు బొడ్డు కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

### కంటివెలుగు ప్రారంభం



రుద్రంగిలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

**ఇల్లంతకుంట:** మండలంలోని వల్లంపట్ల గ్రామంలో కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ అనుసూయ, జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్దం వేణు, ఎంపీపీ వెంకటరమణారెడ్డితో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ప్రజలందరికీ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ఉచితంగా పరీక్షలు నిర్వహించి, మందులు, కళ్లద్దాలు అందజేస్తున్నామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ స్రవంతి, వైద్యాధికారి రమేశ్ పాల్గొన్నారు.

**గైదిగుట్ట తండా గ్రామంలో**

**రుద్రంగి:** మండలంలో గైదిగుట్ట తండా గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ లావణ్య లలిత ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా వైద్య సిబ్బంది ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమున్న వారికి మందులు, కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

### జెండా గద్దె నిర్మాణంపై నిరసన

**ముస్తాబాద్:** మండలంలోని పోతుగల్ గ్రామంలో బీఆర్ఎస్ జెండా గద్దె నిర్మాణంపై బీజేపీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహం ఎదుట రోడ్డు పక్కనే గద్దె నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందవుతుందని అన్నారు. దీనికి స్పందించిన బీఆర్ఎస్ నాయకులు ఎవరికి ఇబ్బంది కలుగకుండా జెండా గద్దె నిర్మిస్తామని మరోచోట పనులు మొదలుపెట్టారు.

# ధాన్యం దళారుల పాలు..

- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- నేరుగా మిల్లులకు తరలింపు
- తక్కువ ధరకు అమ్మకాలు
- అన్నదాత నిలువుదోపిడి
- రోడ్లపై ధాన్యం రాశులు



ట్రాక్టర్‌లో తరలిస్తున్న ధాన్యం



ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెడుతున్న రైతు



రైస్‌మిల్లులో అన్‌లోడ్ చేస్తున్న ధాన్యం

**సిరిసిల్లఅర్బన్:** సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకుంటేనే ఎవరికైనా ప్రయోజనం ఉంటుంది. కాని వరి కోతలు ప్రారంభమై 15 రోజులవుతున్నా జిల్లా కేంద్రం పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ఊసే లేదు. దీంతో రైతులు చేసేది లేక తక్కువ ధరకు అమ్ముకోలేక, ధాన్యం నిలువ ఉంచేందుకు జాగా లేక రోడ్లనే కల్లాలుగా ఉపయోగిస్తున్నారు. కొంతమంది రైతులు మిల్లర్లను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యాన్ని అమ్ముకుంటూ నిలువుదోపిడికి గురవుతున్నారు.

ఆరుగాలం కష్టపడి రైతులు పంట పండించడం ఒక ఎత్తు అయితే ఆ పంటను ఆరబెట్టి, తూకం వేసి రైస్ మిల్లులకు తరలించేవరకు మరో పెద్ద సమస్యగా మారుతుంది. కొనుగోలు కేంద్రాలను సకాలంలో ప్రారంభిస్తామని చెప్పిన ప్రభుత్వం ఇంకా మొదలు పెట్టలేదు. 15 రోజుల క్రితం నుంచే వరి కోతలు ప్రారంభమై ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కొనుగోళ్లు చేపట్టకపోవడంతో ధాన్యం రాశులు కుప్పలుగా పేరుకుపోతున్నాయి. దీంతో స్థలం లేక రైతులు రోడ్లపై ధాన్యాన్ని ఆరబెట్టుకుంటున్నారు. మరోవైపు కొనుగోళ్ల జాప్యంతో రైతులు రైస్ మిల్లులను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా రైస్‌మిల్లర్లు తక్కువ ధరకే ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ అన్నదాతలను అందినకాడికి దోచుకుంటున్నారు.

### ప్రభుత్వ కొనుగోళ్లలో జాప్యం

సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు, చంద్రంపేట, ముష్టిపల్లి, బోనాల, పెద్దూరు, సర్దాపూర్‌లలో పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కాని నేటికి వాటిని ప్రారంభించలేదు. దీంతో రోజురోజుకు ధాన్యం రాశులు కుప్పలు తెప్పలుగా పెరుగుతున్నాయి. పోసిన కుప్పలు పోసినట్లుగా ఉండడంతో తర్వాత వరి కోత కోసిన రైతులకు స్థలం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. కొనుగోళ్లు ప్రారంభించి వెంట వెంటనే ధాన్యాన్ని తరలిస్తే రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు.

### అటకెక్కిన మద్దతు ధర

కొనుగోళ్లలో జాప్యం కారణంగా మొగులు భయంతో రైతులు ధాన్యం అమ్మేందుకు దళారులను ఆశ్రయిస్తున్నారు. కొంతమంది రైతులు నేరుగా రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తీసుకెళ్లి అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం కల్పించే మద్దతు ధర 2,060 కంటే తక్కువ ధరకే రైస్ మిల్లర్లు రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ధాన్యం రకాన్ని బట్టి రూ.1,600 నుంచి 1,700 వరకు కొంటున్నట్లు సమాచారం. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కొనుగోలు కేంద్రాలు జాప్యం, ఆరబెట్టేందుకు స్థలం లేకపోవడం, గతంలో తూకంలో కోతలు అధికంగా విధించారన్న పలుకారణాలతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు.

#### వడ్లు పోసి 15 రోజులయ్యింది



కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసి దాదాపు 15 రోజులు అయితుంది. ఇంకా సెంటర్‌ని ప్రారంభించలేదు. ధాన్యాన్ని ఎప్పుడు కొంటరో అని కొనుగోలు కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నాం. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి.

– సలేంద్రి శ్రీనివాస్, రైతు

#### ఇంకా కొంటలేరు



కోతలు పూర్తయి పది రోజులైంది. ఆరబెట్టేందుకు కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాను. పోసిన కుప్పలు పోసినట్లుగా ఉంటున్నాయి. కానీ ధాన్యాన్ని కొంటలేరు. వర్షాలు కురిస్తే ధాన్యం తడిపిపోయే ప్రమాదం ఉంది. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యాన్ని తరలించాలి.

– అతికం నర్సయ్యగౌడ్, రైతు

#### రెండు రోజుల్లో ప్రారంభిస్తాం



కొనుగోలు కేంద్రాలను రెండు రోజుల్లో ప్రారంభిస్తాం. కొనుగోలు కేంద్రాలను దఫాలవారీగా ప్రారంభించి వెంట వెంటనే ధాన్యాన్ని తరలించేందుకు చర్యలు చేపడుతాం. రైతులు ఆందోళన చెందొద్దు. ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకోని నష్టపోవద్దు.

– సిరిసిల్ల సింగిల్ విండో చైర్మన్ బండి దేవదాస్

#### చివరి గింజ వరకు కొంటాం



రెండు రోజుల్లో వడ్లు కొనుగోలు ప్రక్రియను చేపడుతాం. రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం. ధాన్యం కొనుగోలు కేంద్రానికి స్థలం కేటాయించాలని ఇదివరకే మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లాం.

– జీలకిషన్, పెద్దూరు సింగిల్ విండో చైర్మన్

## నియామకం

### బీజేపీ సోషల్‌మీడియా జిల్లా కన్వీనర్‌గా సాయికిరణ్

**ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రానికి చెందిన సాయికిరణ్‌నాయక్‌ను బీజేపీ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్‌గా నియామిస్తూ పార్టీ జిల్లా అధ్యక్షులు ప్రతాప రామకృష్ణ బుధవారం నియామకపు ఉత్తర్వులు అందజేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, జిల్లా ఇన్‌చార్జి గంగిడి మోహన్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు రెడ్డబోయిన గోపి, రెగుల మల్లికార్జున్, అసెంబ్లీ కన్వీనర్లు మల్లారెడ్డి, సత్తయ్య, మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డికి సాయికిరణ్‌నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.

### అగ్నిమాపక వారోత్సవాలు



ప్రమాదాలపై వివరిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**వేములవాడరూరల్:** అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది వేములవాడ సరస్వతీ శిశుమందిర్‌లో విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఏప్రిల్ 14 నుంచి ప్రారంభమైన అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక విపత్తులను ఎలా ఎదుర్కొవాలో ప్రత్యక్షంగా వివరించారు. లీడింగ్ ఫైర్ మెన్ రాజేందర్‌ప్రసాద్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు ఆందోళన చెందకుండా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. పొడి ఇసుక, కార్బన్ డైఆక్సైడ్‌తో మంటలను ఆర్పవచ్చన్నారు. సెల్‌ఫోన్‌లను చార్జింగ్ బెడ్స్ దగ్గర పెట్టుకోవద్దని, ఎలక్ట్రిక్ వైర్లను చాపల కిందికి పోనివ్వకూడదన్నారు. విద్యుత్ వైర్లకు నిప్పంటుకుంటే నీళ్లతో ఆర్పవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ కమలాకర్, రాజేశ్, శంకర్, యాదయ్య, పాఠశాల ప్రధానాచార్యులు చిలుకగట్టు, విద్యార్థులు, ఆచార్యులు పాల్గొన్నారు.

# రైతుల సంతోషమే ప్రభుత్వ ధ్యేయం

- వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

**వేములవాడరూరల్:** రైతులు సంతోషంగా ఉండడమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రమేష్‌బాబు అన్నారు. వేములవాడ పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోళ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్ట ప్రాంతమైన వేములవాడ నియోజకవర్గంలో ఒకప్పుడు బీడుగా ఉన్న భూములు ప్రస్తుతం ఎల్లంపల్లి నీరు రావడం వల్ల సస్యశ్యామలంగా మారిందన్నారు. అన్ని గ్రామాల్లో నీటి సౌకర్యం ఉండడం వల్ల రైతులు వరి పంటను సాగు చేస్తూ లాభాలు గడిస్తున్నారని అన్నారు. వేములవాడ నియోజకవర్గంలో ఎల్లంపల్లి ద్వారా 55 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్నామన్నారు. వడ్లు ఆరబోసేందుకు కూడా రైతులకు స్థలాలు దొరకడం లేదన్నారు. రైతు బంధు ద్వారా రూ.65 వేల కోట్లు ఇచ్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదేనన్నారు. ఇలాంటిది ఏ రాష్ట్రంలో లేదని ఆయన గుర్తు చేశారు. అనంతరం ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి మాట్లాడుతూ వేములవాడ మండలంలో పీఏసీఎస్ ద్వారా అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు. చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని రైతులు తొందరపడి దళారులకు విక్రయించవద్దని ఆయన సూచించారు. కార్యక్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, వేములవాడ మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, టీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పుల్కం రాజు, కౌన్సిలర్లు గన్నమనేని రామారావు, నిమ్మశెట్టి విజయ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, జడల శ్రీను, ప్యాక్స్ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

### ముంపు గ్రామాల త్యాగం మరువలేనిది

**వేములవాడ:** మిడ్ మానేరు నిర్మాణం కోసం తమ గ్రామాలను త్యాగం చేసిన ముంపు గ్రామాల సేవలను ఈ ప్రాంతవాసులు మరచిపోలేరని, మీ త్యాగ ఫలమే మిడ్ మానేరు వాటర్ హబ్‌కు కేంద్రమైందని ఎమ్మెల్యే రమేశ్ బాబు అన్నారు. బుధవారం తన నివాసంలో చీర్లవంచ గ్రామంలో పది ఆలయాలకు సంబంధించిన పట్టాలను అందజేశారు. ఇప్పటికి రూ.365 కోట్లు అందజేసినట్లు చెప్పారు. రూ.135 కోట్లతో మిగతా సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మూడేళ్లుగా ముంపు గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని, మిగతా రూ.35 కోట్లతో పెండింగ్ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఎంపీపీ వజ్రమ్మ, జెడ్పీటీసీ రవి, సర్పంచ్ సత్తమ్మ, వైస్ ఎంపీపీ రాంచందర్‌రావు, ఎంపీటీసీ దేవరాజం పాల్గొన్నారు.

### చౌడాలమ్మకు బోనాలు



**చందుర్తి:** మండలం ఎన్గల్ గ్రామంలో యాదవుల కుల దైవంగా భావించే చౌడాలమ్మకు భక్తి శ్రద్ధలతో బోనాల ఉత్సవాలను బుధవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఒగ్గు కళాకారుల నృత్యాల మధ్య మహిళ భక్తులు నెత్తిన బోనాలు భారీ ఊరేగింపుగా చౌడలమ్మ ఆలయానికి తరలివెళ్లి నైవేద్యాలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కు అందిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

**వీర్నపల్లి:** మండలంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కల్యాణలక్ష్మి చెక్కులను ఎంపీపీ మాలోత్ భూల, జెడ్పీటీసీ గుగులోతు కళావతి బుధవారం ఆరుగురు లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ తాఫజుల్ హుసేన్, ఉపతహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఆర్ఐ ప్రవీణ్, బీఆర్ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు గుగులోత్ కళ, సర్పంచులు, ఉపసర్పంచులు, బీఆర్ఎస్ మండల నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

### సీఎంఆర్ఎఫ్ చెక్కు..



చెక్కును అందిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**వేములవాడఅర్బన్:** వేములవాడ మండలం సంకెపల్లి గ్రామానికి చెందిన పండుగ లచ్చయ్యకు రూ.15 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కును బుధవారం బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు మచ్చ బుచ్చయ్య, ఏఎంసీ డైరెక్టర్ బండారి శ్రీనివాస్, రెడ్డవేణి పర్శరాములు, కనకరాజు, అంజయ్య, మహేశ్ పాల్గొన్నారు.

### ప్రభుత్వం సర్పంచులను ఆదుకోవాలి

**ఇల్లంతకుంట:** మండలంలోని సర్పంచులకు రావాల్సిన బిల్లులను త్వరగా చెల్లించి ప్రభుత్వం సర్పంచుల సమస్యలు పరిష్కారం చేయాలని సామాజిక ఉద్యమకారుడు సావనపెల్లి రాకేశ్ ఒక ప్రకటనలో కోరారు. సర్పంచులకు నెలలు గడుస్తున్న ఇప్పటి వరకు బిల్లులు రావడం లేదని, పంచాయతీ నిధులు కూడా రాకుండా ప్రభుత్వం ఫ్రీజ్ చేయడం ఏంటని ప్రశ్నించారు. మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ స్పందించి సర్పంచులకు నిధులు విడుదలయ్యేలా చూడాలని కోరారు.

### ఇంటింటా వైద్య సేవలు

**కోనరావుపేట:** మండలం నాగారం, రామన్నపేట గ్రామాల్లో చల్మెడ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఇంటింటా వైద్య సేవలు నిర్వహించారు. ఆస్పత్రి సిబ్బంది గ్రామంలోని ప్రతి ఇంటా సర్వేను నిర్వహించి వారి ఆరోగ్య రికార్డులను నమోదు చేశారు. షుగర్, బీపీ తదితర వ్యాధుల వివరాలను సేకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి అవసరమైన మందులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచులు బాస లావణ్య, కాదాస్ సంతోష్ పాల్గొన్నారు.

### అంగన్‌వాడీలో చిన్నారుల గ్రాడ్యుయేషన్ డే

**బోయినపల్లి:** మండలంలోని వెంకట్రావుపల్లి అంగన్వాడీ కేంద్రంలో బుధవారం రాత్రి చిన్నారులకు చేపట్టిన గ్రాడ్యుయేషన్ డే ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, సీడీపీవో సుచరిత, సూపర్‌వైజర్ సుచరిత, అంగన్వాడీ టీచర్లు వరలక్ష్మి, వనజ, సర్పంచ్ బూర్గుల నందయ్య పాల్గొన్నారు.

# ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ



జిల్లెల్లలో తోఫా అందజేస్తున్న ఎంపీపీ



దుమాలలో కానుకలు అందిస్తున్న నాయకులు

**సిరిసిల్లటౌన్:** మదీన యూత్ వెల్ఫేర్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేద ముస్లింలకు రంజాన్ రేషన్ కిట్లను పంపిణీ చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు సయ్యద్ ఉస్మాన్ అధ్యక్షతన 30 మందికి ఇరవైరెండు రకాల నిత్యావసరాల కిట్లను వితరణ చేశారు. ప్రధాన కార్యదర్శి సయ్యద్ షఫీ, ఉపాధ్యక్షుడు సయ్యద్ అక్రమ్‌తో పాటు మజీద్‌కమిటీ అధ్యక్షుడు ఎం.డి. సలీం, మాజీ అధ్యక్షుడు యూసుఫ్, రీనాబాబా తదితరులు పాల్గొన్నారు.

**తంగళ్లపల్లి:** మండలంలోని జిల్లెల్ల గ్రామ పరిధిలో ముస్లింలకు బుధవారం ప్రభుత్వం నుంచి అందించే రంజాన్ కానుకను ఎంపీపీ పడిగెల మానస, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు మాట్ల మధుతో కలిసి పంపిణీ చేశారు.

**వీర్నపల్లి:** రంజాన్ పండుగను పురస్కరించుకొని మండల కేంద్రంలో బుధవారం ముస్లింలకు రంజాన్ కానుకలుగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ తఫాజుల్ హుస్సేన్, జెడ్పీ కోఆప్షన్ చాంద్‌పాషా, ఎంపీపీ మాలోత్ భూల, జెడ్పీటీసీ గుగులోత్ కళావతి, సర్పంచ్ దినాకర్, ఉపసర్పంచ్ రవి, ఎంపీటీసీ అరుణ్‌కుమార్, ఎంపీడీవో నరేశ్‌కుమార్, డీటీ ప్రవీణ్‌కుమార్, పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డిపేట:** మండలంలోని దుమాలలో రంజాన్ తోఫా అందించి సర్పంచ్ కదిరే రజిత ఆధ్వర్యంలో ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. నాయకులు నరసింహారెడ్డి, బాలయ్య, భాస్కర్, హనుమంతు, బాలకిషన్, ముస్లింలు పాల్గొన్నారు.

**గంభీరావుపేట:** మండల కేంద్రంలోని వంద మంది పేద ముస్లిం కుటుంబాలకు సిద్దిపేట ఫౌండేషన్ వారు కిట్లను పంపిణీ చేశారు. జామ మసీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు సయ్యద్ ఆసిఫ్ అలీ సాధత్, ప్రస్తుత అధ్యక్షుడు మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

### కొనుగోలు కేంద్రం ప్రారంభం

**తంగళ్లపల్లి:** నేరెళ్ల సింగిల్‌విండో ఆధ్వర్యంలో మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ మానస బుధవారం ప్రారంభించారు. నర్సింహులపల్లెల గ్రామంలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ కోడూరి భాస్కర్ గౌడ్, సర్పంచ్ సరిదెన ఆనందరావు, ఎంపీటీసీలు బైరినేని రాము, చెన్నమనేని వెంకట్రావు పాల్గొన్నారు.

**ముస్తాబాద్:** మండలంలోని మోహిన్‌కుంట గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ వనజ బుధవారం ప్రారంభించారు. ఉపసర్పంచ్ సంధ్య, ఐకేపీ ఏపీఎం జయసుధ పాల్గొన్నారు.

**గంభీరావుపేట:** మండలంలోని దమ్మన్నపేటలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంపీపీ వంగ కరుణ బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ సిరిగిరి లక్ష్మీ, సింగిల్‌విండో సీఈవో రాజిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

### 'సమ్మేళనాలతో మోసం చేస్తున్న ఎమ్మెల్యే'

**కోనరావుపేట:** ప్రజలను మోసం చేయడానికే ఎమ్మెల్యే బీఆర్ఎస్ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నారని బీఎస్పీ మండలాధ్యక్షుడు కుమ్మరి దేవదాస్ విమర్శించారు. మండలంలోని వెంకట్రావుపేటలో మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో అన్ని మండలాల్లో వెనుకబడిన మండలం ఒక్క కోనరావుపేటనేనన్నారు. ఈ ప్రాంతంలో నాలుగు దశాబ్దాలుగా ఎమ్మెల్యేగా చలామణి అవుతున్న వారు అభివృద్ధిని చేయలేకపోయారన్నారు. మండలంలో ఒక్క డబుల్ బెడ్రూం ఇల్లు కూడా కట్టివ్వలేకపోయారని అన్నారు. దళితబంధు పథకంలో బీఆర్ఎస్ కార్యకర్తలే తప్ప నిరుపేదలెవ్వరూ లేరన్నారు. మరికొద్ది రోజుల్లో ఎన్నికలు వస్తున్నాయనే ఆ త్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్, బహుజన వాలంటరీ ఫోర్స్ బొల్లె జాషువా, సుధీర్, ప్రకాశ్, మైఖేల్ పాల్గొన్నారు.


### డిగ్రీ ఫలితాల్లో టాప్ వికాస్



ఫస్టియర్ ఫలితాల్లో రాణించిన విద్యార్థులు

**సిరిసిల్లటౌన్:** శాతవాహన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ ప్రథమ సంవత్సర ఫలితాల్లో సిరిసిల్ల వికాస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు మెరిశారు. ఎం.రమ్య(9.2), అర్చన(9.1), వర్షా(9.09), కావ్య (9.02) గ్రేడ్‌లు సాధించారు. మిగతా విద్యార్థులు ఉత్తమ గ్రేడ్ సాధించడంతో ప్రిన్సిపాల్ దిడ్డి శ్రీనివాస్ వారిని అభినందించారు.

### వీడ్కోలు హంగామా



**చందుర్తి:** మండలంలోని ఎన్గల్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం సాయంత్రం వీడ్కోలు పార్టీలో విద్యార్థుల డ్యాన్స్‌లు అలరించాయి. సర్పంచ్ లింగంపల్లి సత్తయ్య, ఉప సర్పంచ్ మంజుల, ఎంపీటీసీ కవిత, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాములు, ఎస్ఎంసీ చైర్మన్ కుసుంభ మధు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా ఉంటాం

- కాంగ్రెస్ నియోజకవర్గ సిరిసిల్ల ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి



కోరుట్లపేటలో విజయ్‌రెడ్డిని పరామర్శిస్తున్న కేకే

**ఎల్లారెడ్డిపేట:** ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్తలకు కాంగ్రెస్ అండగా ఉంటుందని, వారిని పార్టీపరంగా ఆదుకుంటామని ఆ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేటలో గుడాటి విజయ్‌రెడ్డి, నారాయణపూర్‌లో ఎండి మోదిన్, మండల కేంద్రంలో పెంటయ్య కుటుంబాలను బుధవారం ఆయన పరామర్శించారు. మండల కేంద్రంలో గోడకూలి తల్లికూతుర్లు మరణించగా ఆ కుటుంబసభ్యులను పరామర్శించి కొంత నగదును అందించి మాట్లాడారు. గోడకూలి మృతి చెందిన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. 2023లో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. అందుకు కార్యకర్తలు మనోధైర్యంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. కార్యకర్తలే పార్టీకి మూలస్తంభాలన్నారు. మండల అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, నాయకులు గౌస్, లింగంగౌడ్, బాబు, రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాజు, ఇమామ్, దేవయ్య పాల్గొన్నారు.

### పీహెచ్‌డీ సాధించిన ఉపాధ్యాయురాలు



సన్మానం చేస్తున్న జెడ్పీటీసీ

**రుద్రంగి:** స్థానిక మండల పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయినీ వడ్డెపల్లి సంధ్య పీహెచ్‌డీ పట్టా సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తూ జెడ్పీటీసీ గట్ల మీనయ్య, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయ బృందం జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం శాలువాతో సన్మానించి, సత్కరించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి సింగిరెడ్డి నారాయణరెడ్డి గీతాలపై ఆమె పరిశోధన చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం శంకర్, నాయకులు గంగం మహేష్, దయ్యాల కమలాకర్, స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.